ములుగులో కవితకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నేతలు

ములుగు రూరల్, ఏప్రిల్ 21: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ములుగులో బీఆర్ఎస్ నేతలు సోమవారం కలిశారు. ఎమ్మెల్సీ కవిత భద్రాచలం నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు ములుగు మీదుగా వెళ్తుండగా జడ్పీ మాజీ వైస్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. నాగజ్యోతి వెంట బీఆర్ఎస్ నాయకులు పోరిక గోవింద్‌నాయక్, పోరిక విజయ్‌రామ్‌నాయక్, కోగిల మహేశ్, గునిగంటి హరీశ్, నాజర్‌ఖాన్, హరీలాల్, గునిగంటి హరీశ్ ఉన్నారు.

గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరిక

రేగొండ, ఏప్రిల్ 21: గోరికొత్తపల్లి మండలం చిన్నకోడెపాక గ్రామ మాజీ సర్పంచ్ గుండు బుచ్చమ్మతోపాటు కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. చిన్నకోడెపాక గ్రామ సర్పంచ్, గుండు బుచ్చమ్మ, సీనియర్ నాయకులు గుండు సదానందంతో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు నచ్చక బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే భారీ స్థాయిలో చేరికలు ఉంటాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కునూరి సదానందం, మార్క సుధాకర్ ఉన్నారు.

క్రీడా ప్రాంగణ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

గణపురం, ఏప్రిల్ 21 : మండలంలోని చెల్పూర్ రెవెన్యూ శివారులో క్రీడా ప్రాంగణాన్ని కేటాయించిన ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి, చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని గ్రామానికి చెందిన మాల కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. రామసముద్రం చెరువును ఆనుకొని (చెల్పూర్ నుంచి పెద్దాపూర్ వెళ్లే రోడ్‌కు) సుమారు ఎకరం భూమిని గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణానికి కేటాయించగా ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముతున్నారని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో మాధవరావుపల్లి కాలనీని ఆనుకొని పూర్వం నుంచి సాగు చేసుకున్న భూమిలో 140 నిరుపేద కుటుంబాలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారని, ఆ భూమిని తమకు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

సీసీ కెమెరాల పనితీరును కార్యదర్శులు చూసుకోవాలి

గణపురం, ఏప్రిల్ 21: గ్రామాల్లో సీసీ కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జీపీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? పరిశీలించాలన్నారు. మొత్తం సీసీ కెమెరాల మానిటర్లను జీపీ సెక్రటరీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీపీ కార్యదర్శులు సీసీ కెమెరాల పనితీరు రోజూ తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఏప్రిల్ 21: ప్రజావాణిలో ప్రజా వినతులను త్వరగా పరిష్కరించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రజావాణిలో 52 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో సరస్వతి పుష్కరాల పనుల పురోగతిపై కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. గోదావరి నదిలో నీటి సామర్థ్యాన్ని నిశితంగా గమనించాలన్నారు. కాగా, జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఇతర అధికారులు కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ములుగు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ విచారణకు ఆదేశించి తగిన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారి రాంపతిని ఆదేశించారు. వినతిపత్రం అందించిన వారిలో సుమన్, సంపత్, రాజు, వెంకన్న, లక్ష్మయ్య, కుమార్ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ములుగు రూరల్: దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

మంగపేట : మండలంలోని పూరేడుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు సోమవారం ములుగు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాన్ని పైలట్ గ్రామంగా ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయనుకుంటే కమిటీ వాళ్లు గ్రామంలోని లేని వారి పేర్లు కూడా జాబితాలో చేర్చినట్లు తెలిపారు. విచారణ జరిపి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఐదు కిలోల ధాన్యం కటింగ్

ప్రజావాణిలో కొనుగోలు కేంద్రంపై రైతుల ఫిర్యాదు

ములుగు, ఏప్రిల్21(నమస్తేతెలంగాణ) : ములుగు మండలం బండారుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వానకాలంలో క్వింటా ధాన్యానికి ఐదు కిలోల చొప్పున కటింగ్ చేసి డబ్బులు చెల్లించారని ఆరోపిస్తూ రైతులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లక్ష్మీగణపతి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైస్ మిల్లర్లు కటింగ్ లేకుండా ధాన్యాన్ని నింపుకున్నట్లు ట్రక్ షీట్లను అందించినప్పటికీ క్వింటాకు 5కిలోల చొప్పున కటింగ్ చేసి డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. సదరు కేంద్రం ద్వారా 36 లారీల ధాన్యం రైస్ మిల్లులకు

ములుగు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

చేరవేశారని, ప్రతి లారీలో క్వింటాకు 5కిలోలు కట్ చేసినట్లు చూపుతూ ఇతరుల పేరు మీదకు రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయించుకున్నారని అన్నారు. అదేవిధంగా సన్నధాన్యం సెంటర్‌లో ప్రభుత్వం అందించే సబ్సిడీని కూడా బినామీ పేర్లతో కాజేశారని అన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఏప్రిల్ 21: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభకు రజకులంతా పెద్ద సంఖ్యలో తరలాలని రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, రజక సంఘం టౌన్ అధ్యక్షుడు వైనాల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి గోపరాజు రాజు, నాయకులు రావుల సూరయ్య, పైండ్ల రఘుపతి, మహేశ్, ఓరుగంటి లక్ష్మి, రమేశ్, బిజిరి సంపత్, రాయమల్లు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను సోమవారం ములుగు మండలం కాసిందేవిపేటలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బహిరంగ సభకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు అమర్‌సింగ్, రామయ్యపల్లి, రాంనగర్‌తండా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రజక సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు

భూ భారతిపై అవగాహన సదస్సు

చిట్యాల: అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఏప్రిల్ 21: భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయితా ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ చట్టంలోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి ప్రజలకు మరో తల్లి వంటిదని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమికి భూధార్ కార్డు జారీ చేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీఓ రవి, తహసీల్దార్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ మేకల సంపత్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే హాజరై పది నిమిషాలు మాట్లాడి వెళ్లిపోగా రైతులు, ప్రజలు కూడా వెళ్లి పోవడంతో ఖాళీ కుర్చీలు మిగిలాయి. అధికారులను సందేహాలు అడుగుతుండగా అవగాహన సదస్సు ముగిసిందని చెబుతూ వారు కూడా వెళ్లిపోయారు. దీంతో రైతులు అసహనంతో వ్యక్తం చేశారు. కాగా, ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో సోమవారం భూ భారతి సదస్సు నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ దివాకర హాజరై భూ భారతి పోర్టల్‌పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

చిట్యాల గురుకుల పాఠశాల అంబేద్కర్ విగ్రహావిష్కరణ

చిట్యాల: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో రిటైర్డ్ డీడబ్ల్యూఓ చిన్నయ్య ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ పాల్గొన్నారు.

25 నుంచి చేపలు పట్టాలని తీర్మానం

గణపురం, ఏప్రిల్ 21: గణప సముద్రం చెరువులో ఈ నెల 25 నుంచి చేపలు పట్టాలని తీర్మానం చేసినట్లు మత్స్య శాఖ అధ్యక్షుడు మల్లెబోయిన రాజు తెలిపారు. సోమవారం చెరువు కట్టపై మత్స్యశాఖ డైరెక్టర్లు కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు శుక్రవారం ఉదయం నుంచి వలలు వేసి చేపలు పట్టుకోవాలని, మే 1 నుంచి రొయ్యలు పట్టాలని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కొంతం గణపతి, ఉపాధ్యక్షుడు గుండ్ల రాజు, డైరెక్టర్లు మునిగాల రమేశ్, దార్ల రఘు, మల్లెబోయిన ఉప్పలయ్య, గుళ్ల రాజ్‌కుమార్, పల్లెబోయిన కృష్ణంరాజు, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుమార్తె వివాహానికి రూ.50వేల చేయూత

రవీందర్ కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

ములుగు రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని జంగాలపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఎల్లబోయిన రవీందర్ కుమార్తె వివాహానికి బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ రావు రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రవీందర్ కుటుంబానికి అండగా ఉండేందుకు ఈ ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముడుతనపల్లి మోహన్, మప్రగాని వినయ్‌కుమార్ రూ.10వేల చొప్పున, వెంకటాపూర్ మాజీ జడ్పీటీసీ గై రుద్రమదేవి రూ.5వేలు అందించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఆదిరెడ్డి, సత్యనారాయణరావు, భోజారావు, రఘుపతి, ప్రదీప్‌రావు, మహేందర్, రమేశ్, రాజు, గంగయ్య, కిషోర్, రవీందర్, ఖాజాపాషా, రఘు, చంద్రబాబు, రామకృష్ణ, శ్రీరామ్, రాంనర్సయ్య, కిషోర్, శరత్, రాళ్ల ఉన్నారు. సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తస్లీమ్‌మహ్మద్ రూ.5వేలు, తప్పట్ల గణపతి, దుబాషి రమేశ్ రూ.2వేల చొప్పున సాయాన్ని అందించారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని..

- **యువకుడి హత్య**
- **పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు కానిస్టేబుల్, మరో ముగ్గురు**
- **ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన**

సుబేదారి, ఏప్రిల్ 21 : పక్కా ప్లాన్‌తో ఓ యువకుడిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ (నూగూరు) కు చెందిన స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న సాయిప్రకాశ్(28) ఈనెల 15న తన కారులో హాస్పిటల్‌లో ఉన్న బంధువులను చూడడానికి వరంగల్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు హనుమకొండ పోలీసు స్టేషన్ మిస్సింగ్ కేసు పెట్టారు. ఈనెల 18న పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. హనుమకొండకు చెందిన పోలీసు కానిస్టేబుల్ గతంలో వెంకటాపూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సాయిప్రకాశ్ దగ్గరి బంధువుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో సాయిప్రకాశ్ ములుగు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేయగా, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ప్రకాశ్‌ను హత్య చేయడానికి పక్కా ప్లాన్‌వేసి, పరిచయం ఉన్న ముగ్గురు యువకులతో కలిసి విచారణ చేపట్టారు. ఈనెల 15న సాయిప్రకాశ్‌ను హనుమకొండలో కిడ్నాప్ చేశాడు. కారులో కరీంనగర్ జిల్లా రహదారి వైపు తీసుకెళ్లి హత్యచేసినట్లు తెలిసింది. పోలీసులు కానిస్టేబుల్‌తో పాటు మిగతా ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చూపించి పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

ఒకరికి ఏడాది జైలు, జరిమానా

వాజేడు, ఏప్రిల్ 21: యాక్సిడెంట్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్సై ఎన్ రాజ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018లో ఏటూర్‌నాగారం మండలం శివపూర్ నుంచి డ్రైవర్, ఓనర్ కోమేర బాబూరావు వాజేడు మండలం పెద్దగొల్లగూడెంకు తన వాహనంలో కూలీలను ఎక్కించుకొని వస్తుండగా అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో మండపాక సమీపంలో ఎన్‌హెచ్‌పై అదుపుతప్పి బోల్తాపడి ముగ్గురు మృతిచెందినట్లు పేర్కొన్నారు. నాటి ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, సీఐ నలువాల రవీందర్ కేసు నమోదు చేయగా ప్రాసిక్యూషన్ తరపున ఎస్ఆర్ఐ వీ శ్యామ్‌ప్రసాద్, పీపీ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కూలీల మృతికి కారణమైన కోమేర బాబూరావుకు జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఏడాదిపాటు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు వివరించారు.

బాధితురాలికి మంత్రి పరామర్శ

ములుగు రూరల్, ఏప్రిల్ 21: ములుగు ప్రభుత్వ దవాఖానలో కాన్పు సమయంలో బిడ్డను కోల్పోయిన రవళిని మంత్రి సీతక్క సోమవారం పరామర్శించారు. హనుమకొండలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

డీసీఎంలో తరలుతున్న పశువుల పట్టివేత

ఏటూరునాగారం, ఏప్రిల్ 21: డీసీఎం వ్యానులో తరలుతున్న 27 పశువులను పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. మండలంలోని రొయ్యూరు క్రాస్ వద్ద ఎన్‌హెచ్‌పై సోమవారం తెల్ల వారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా చర్ల నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో నిబంధనలు పాటించకుండా 27 పశువులను కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గోశాలకు తరలించారు. డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చర్ల ప్రాంతంలోని చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు చేసి వాహనాల్లో తరలించి హైదరాబాద్‌లో అమ్మకాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ స్లాట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 21: రిజిస్ట్రేషన్ స్లాట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డాక్యుమెంట్ రైటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట జిల్లా డాక్యుమెంట్ రైటర్లు ధర్నా నిర్వహించారు. రైటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రాజు మాట్లాడుతూ పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. డాక్యుమెంట్ రైటర్లు బుర్ర అశోక్, జితేందర్, వినోద్, రమేశ్, విజయ్, ప్రశాంత్, విక్రమ్, రాజేశ్, రాజు, సదానందం, సునిల్ పాల్గొన్నారు.

అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 21: సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన యువకుల కోసం 2025-26 సంవత్సరానికి అగ్నివీర్ నియామక డ్రైవ్‌లో వివిధ విభాగాల్లో అగ్నివీర్ నియామకానికి జయశంకర్ జిల్లాలోని నిరుద్యోగ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి, కల్పన శాఖ అధికారి అరూరి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్‌కీపర్, టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్ వర్గాల్లో నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం సికింద్రాబాద్ 040-27740205 నంబర్ సంప్రదించాలని కోరారు.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు

మంగపేట, ఏప్రిల్ 21: మండలంలోని కమలాపురం సీపీ నగర్‌లో సోమవారం కోతుల గుంపు బట్టు సరోజనతోపాటు కోమలపై దాడి చేసి గాయపరిచాయి. సరోజన ఇంటి ముందు అరేసిన బట్టలు తీస్తుండగా కోతులు ఒక్కసారిగా మీదపడి కరిచాయి. ఎడమ మోచేయి పైభాగంలో తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు 108లో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. కోమలపై కూడా కోతులు దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి.

పాలిసెట్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 21: సింగరేణి ఉన్నత పాఠశాలలో పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో పాలీసెట్ శిక్షణ తరగతులను సోమవారం జీఎం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఏటా రూ.45కోట్లను విద్యకు ఖర్చు చేస్తోందని, భూపాలపల్లి ఏరియాలోని పరిసర ప్రాంతాల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ కే మారుతి, హెచ్ఎం సీహెచ్ ఝాన్సీ పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 21: ఐటీడీఏలో సోమవారం గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ వినతులను పీవో చిత్రామిశ్రాకు అందజేశారు. కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లలో కట్టర్ జాబ్స్‌ను ఐటీఐ చేసిన వారితో భర్తీ చేయాలని తుపాకులగూడెంకు చెందిన యువకుడు ప్రేమ్‌సాగర్ దరఖాస్తు సమర్పించారు. ఆకులవారి ఘనపూర్‌కు చెందిన కెంసర్తి అరుణ జీవనోపాధి కోసం దరఖాస్తు సమర్పించారు. షాపింగ్ కాంప్లెక్సు మరమ్మతు చేయాలని బడేసులోచ కోరారు. మంగపేట మండలం బాలన్నగూడెంకు చెందిన తిరుపతి, లక్ష్మయ్యతోపాటు మరికొందరు అటవీ క్షేత్రాధికారులు స్వాధీనం చేసుకున్న తమ భూములను తిరిగి ఇప్పించాలని కోరారు. తాడ్వాయి లోని మండల పరిషత్ పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా నియమించాలని లింగయ్య, రవి, సంతోశ్ వినతి పత్రం అందజేశారు. డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

48 డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం

ములుగు రూరల్, ఏప్రిల్ 21: జిల్లాలోని ములుగు, గోవిందరావుపేట, పస్రా, ఏటూరునాగారంలో హోటల్స్, గ్యాస్ రీఫిల్లింగ్ షాపులు, చికెన్ సెంటర్లు, టీ స్టాల్స్, కిరాణషాపుల్లో సోమవారం తనిఖీలు చేసి 48 డొమెస్టిక్ సిలిండర్లను సివిల్ సప్లై జిల్లా అధికారి ఫైసల్ హుస్సేన్ స్వాధీనం చేసుకున్నారు. సదరు షాపుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. షాపుల్లో కమర్షియల్ సిలిండర్లు వాడాలని సూచించారు.

'చిన్న కాళేశ్వరం కెనాల్'పై గ్రామ సభ

మహదేవపూర్, ఏప్రిల్ 21 : మండలంలోని బెగ్లూర్‌లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ తవ్వకాల భూసేకరణ కోసం సోమవారం అధికారులు రైతులతో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ గురించి అధికారులు రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కెనాల్ తవ్వకాలపై రైతులు అభిప్రాయాలను, సూచనలను అధికారులకు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఏఈఈ భరత్ ఆనంద్, ఆర్ఐ జగన్మోహన్‌రెడ్డి, జీపీ కార్యదర్శి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

'చెరువులను చెరపట్టిన వారిపై చర్యలేవి?'

కాటారం, ఏప్రిల్ 21: చెరువులను చెరపట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ ప్రశ్నించారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు రూ.3కోట్లకు పైగా విలువైన చెరువు మట్టిని తరలించారని ఆరోపించారు. పోతుల్‌వాయి శివారులోని నల్లగుంట, విలాసాగరం, శంకరంపల్లి, దేవరంపల్లి, పరికిపల్లి చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుమ్మడి తిరుపతి, బొడ్డు కిశోర్, రజనీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **POGULA VARA PRASAD,** R/o H.No: 11-25-531, Kothawada, Warangal Dist-506 002, Telangana. I have changed my minor daughter's name from **POGULA HONEY** to **POGULA ANANYA** for all future purposes.
NTW-17581

**CH